సాక్షి తిరుపతి

సోమవారం । 7 । జూలై । 2025



యోగ నిద్రలో నరసింహుడు

పెంచలకోన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం లో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. - 8లో



కౌలు రైతుల ఎదురుచూపులు

కౌలు రైతులకు ప్రభుత్వం అందజేసే సీసీఆర్ కార్డుల జారీలో జాప్యం నెలకొనడంతో రుణాలు పొందలేకపోతున్నారు. - 8లో



అస్తవ్యస్తంగా సచివాలయాలు

సచివాలయాలను కుదించి, ఇష్టారాజ్యంగా బదిలీలు చేపట్టడంతో నెలరోజులుగా సేవలు అంతంత మాత్రంగా సాగుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో పాటు పలు విభాగాలకు చెందిన జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారు. ఈ క్రమంలో అర్జీదారులు తమ సమస్యలను నేరుగా జిల్లా అధికారులకు తెలియజేయడానికి అవకాశం కల్పించారు.

విద్యుత్ సర్వీసులపై ఆకస్మిక తనిఖీలు



అర్ధరాత్రి దాటిన తరువాత అక్వా రైతుల పొలాల్లో తనిఖీ చేస్తున్న విద్యుత్తు అధికారులు

తిరుపతి రూరల్ : తిరుపతి ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని కోట సబ్ డివిజన్ వాకాడు, చిట్టమూరు సెక్షన్లలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత విద్యుత్తు శాఖ డీపీఈ విభాగపు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా చేపల పెంపకం చేపడుతున్న అక్వా రైతుల పొలాల వద్దకు వెళ్లి చేపల చెరువులకు వినియోగించే విద్యుత్తు సర్వీసులను తనిఖీ చేశారు. వాకాడు, చిట్టమూరు సెక్షన్ల పరిధిలో అనధికారిక విద్యుత్తు కనెక్షన్లు తీసుకుని విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్టు డీపీఈ విభాగపు ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు గంగాధర్ రెడ్డి తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 87,536 మంది స్వామి వారిని దర్శించుకోగా 35,120 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.33 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

అయ్యో..అధ్యాపకులు

జిల్లాలో ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి అయోమయంగా మారింది. మూడు నెలలుగా జీతాలు లేక ఈ ఏడాదికి పొడిగింపు (రెన్యూవల్) ఉత్తర్వులు అందక కుటుంబ పోషణ భారమై అగచాట్లు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేసేందుకు జీవో 114 విడుదల చేసింది. ఆ సమయంలో ఎన్నికలు రావడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. అనంతరం కొలువుదీరిన కూటమి ప్రభుత్వం అధ్యాపకుల రెగ్యులైజేషన్ ఉత్తర్వులను తుంగలో తొక్కి వారి జీవితాలతో చెలగాటమాడుతోంది.

- ప్రశ్నార్థకంగా కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి
- ఉద్యోగ భద్రత కరువు..బతుకు భారం
- ప్రభుత్వ, టీటీడీ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు అందని రెన్యూవల్ ఉత్తర్వులు
- తరగతులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- మూడు నెలలుగా అందని వేతనాలు
- దయనీయ స్థితిలో కాంట్రాక్టు అధ్యాపకులు



తిరుపతి సిటీ : ప్రభుత్వ, టీటీడీ డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల భద్రత కరువై బతుకు భారంగా మారింది. కళాశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులకు తప్ప మిగిలిన డిగ్రీ, టీటీడీ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు ఉద్యోగ రెన్యూవల్ ఆర్డర్స్ ఇచ్చిన పాపాన పోలేదు. 2025–26 అకడమిక్ ఇయర్ కోసం ప్రస్తుతం పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులను కొనసాగించాల్సి ఉండగా ప్రభుత్వం ఆ మేరకు అడుగులు వేసే ప్రయత్నం చేయడం లేదు. దీంతో అధ్యాపకులు మే నుంచి జులై వరకు మూడు నెల జీతాలకు నోచుకోలేదు. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో 2002 నుంచి పలు డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సుమారు 800 మందికి పైగా అధ్యాపకులు ఉద్యోగ భద్రత కరువై చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నారు.

గత ప్రభుత్వం పర్మినెంట్‌కు ఆదేశాలిచ్చినా..

అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు 2024లో జీఓ 114 విడుదల చేసి ప్రక్రియ శరవేగంగా కొనసాగుతున్న తరుణంలో సాధారణ ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ఇచ్చిన ఉత్తర్వులను తుంగలో తొక్కింది. కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను పక్కన పెట్టి డిగ్రీ అధ్యాపకుల నియామకాల కోసం ఏపీపీఎస్సీ ద్వారా నియమించేందుకు చర్యలు చేపట్టింది. దీంతో కాంట్రాక్ట్ అధ్యాపకుల పరిస్థితి అయోమయంలో పడింది. రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైన అధ్యాపకులతో తాత్కాలిక అధ్యాపకుల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారనుంది. కొంత మంది అధ్యాపకులు గత 22 సంవత్సరాలుగా పనిచేసినప్పటికీ రెగ్యులర్ చెయ్యకపోవడం కనీసం టైం స్కేల్ కూడా ఇవ్వకపోవడం దారుణం.

జిల్లా సమాచారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	18
పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు	78
టీటీడీ డిగ్రీ కళాశాలలు	5
పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు	132
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	66
పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు	521
టీటీడీ జూనియర్ కళాశాలలు	3
పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు	52
డిగ్రీ కళాశాలలో రిటైర్‌మెంట్‌కు చేరువలో ఉన్న తాత్కాలిక అధ్యాపకులు	75
జూనియర్ కళాశాలలో రిటైర్‌మెంట్‌కు చేరువలో ఉన్నవారు	37

అసెస్‌మెంట్ల పేరుతో కాలయాపన

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, టీటీడీ డిగ్రీ కళాశాలలో 50 నుంచి 60 శాతం మంది కాంట్రాక్టు అధ్యాపకులే పనిచేస్తున్నారు. కళాశాలల నిర్వహణలో నాణ్యమైన విద్యను అందించడంలో వీరిదే ప్రధాన పాత్ర. అధ్యాపకులందరూ ఎంతో పనితీరును ప్రదర్శిస్తే గానీ నాక్ ఏ ప్లస్ గ్రేడ్లు, అటానమస్ హోదాలు రావడం కష్టసాధ్యం. కానీ ప్రభుత్వం ఏటా కాంట్రాక్టు లెక్చర్ల పనితీరును పరీక్షించడానికి ఎన్నడూ లేని విధంగా అసెస్‌మెంట్ పేరుతో రెండు, మూడు నెలలు కాలయాపన చేసి రెన్యూవల్స్ ఇస్తూ అధ్యాపకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

రిటైర్‌మెంట్‌కు దగ్గర పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

జిల్లాలో ప్రభుత్వ, టీటీడీ కళాశాలలో 22 ఏళ్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రతకు నోచుకోలేక సతమతమతం అవుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల పరిస్థితి దారుణంగా తయారైంది. పలు డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సుమారు 75 మంది తాత్కాలిక అధ్యాపకులు రెండు, మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అటు పర్మినెంట్ చేయకపోగా ప్రస్తుతం ఉన్న ఉద్యోగాన్ని కొనసాగించకపోవడంతో వారికి ఎటూ పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏటా 12 నెలల పాటు అధ్యాపకుల చేత సేవ చేయించుకుని కేవలం 10 నెలల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారు. దీనికి తోడు వేతనాలు సరైన సమయానికి అందించకుండా మూడు, నాలుగు నెలలకు ఒకసారి అందిస్తున్నారు.

ఏటా నాలుగు నెలల నిరీక్షణ

గతంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులకు అకడమిక్ ఇయర్ ప్రారంభం నాటికి రెన్యూవల్ ఆర్డర్స్ వచ్చేవి. గత ఏడాది నుంచి పరిస్థితి దారుణంగా తయారైంది. కానీ కళాశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి కాకుండా మూడు నెలలు ఆలస్యంగా కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తున్నారు. దీంతో ప్రతి సంవత్సరం నాలుగు నెలలు జీతభత్యాలు ఆలస్యమవడంతో ఆర్థికంగా చితికిపోయి అప్పుల పాలవుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. ప్రక్రియ పూర్తయే వరకు నూతన రిక్రూట్‌మెంట్ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలి. ప్రస్తుతం 2025–26 సంవత్సరానికి సంబంధించి తాత్కాలిక అధ్యాపకులను కొనసాగిస్తూ ఉత్తర్వులు తక్షణం జారీ చేయాలి. దీంతో పాటు కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉన్న సబ్జెక్ట్‌లకు వదిలేసి ఖాళీగా ఉన్న సబ్జెక్ట్‌లకు మాత్రమే నూతన రిక్రూట్‌మెంట్ ద్వారా అధ్యాపకుల ఎంపిక చేయాలి. – డిగ్రీ కాంట్రాక్ట్ అధ్యాపకులు, తిరుపతి జిల్లా

సార్వత్రిక సమ్మెకు టీటీడీ ఉద్యోగుల మద్దతు



సమావేశానికి హాజరైన టీటీడీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ కార్మికుల ప్రయోజనాల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు తమ మద్దతు ఉంటుందని టీటీడీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ప్రకటించారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి లక్షల మంది ఉద్యోగులకు పెన్షన్ లేకుండా చేసి వారి హక్కులను హరింపజేశారన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిని 12 గంటలకు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టీటీడీ ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు గోల్కొండ వెంకటేశం, కాటా గుణశేఖర్, పట్నం దయాకర్, నైనార్ పద్మనాభం, వేణుగోపాల్, రవికుమార్ , ఆదిలక్ష్మి, మునికిరణ్ కుమార్, ధనంజేయులు, శ్రీనివాసులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అడవులు, వన్యప్రాణుల అభివృద్ధికి చర్యలు



రాపూరు సమీపంలోని అడవులను పరిశీలిస్తున్న ఏకే నాయక్

రాపూరు : అడవులు, వన్యప్రాణుల అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేట్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ వివరించారు. నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల సరిహద్దు ప్రాంతమైన రాపూరు వెలుగొండ అడవుల్లోన్ని కూటలమర్ని పోయే ప్రాంతాన్ని జిల్లా అటవీశాఖ అధికారులతో కలిసి ఆదివారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల్లో నిత్యం అటవీశాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మూడు జిల్లా సరిహద్దు ప్రాంతంలో సహజ సిద్ధంగా ఎర్రచందనం ఉందని వాటిని రక్షించాలని సూచించారు.అలాగే పెనుశిల అభయార్యణంలో అనేక రకాలైన వన్యప్రాణులు జీవిస్తున్నాయన్నారు. వన్యప్రాణులకు రక్షణ కల్పించాలన్నారు. ముఖ్యంగా మంచినీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఎర్ర చందనం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఉందని దానిని కాపాడుకోవాల్సి బాధ్యత ఉందన్నారు. అటవీ సిబ్బంది పరస్పర సహకారంతో అడవుల్లో తిరగాలన్నారు. అడవి లోపలకు వెళ్లకపోతే విషయాలు తెలియవని అధికారులు తిరుగుతుంటే బయట వ్యక్తులు అడవిలోకి రాలేరన్నారు. ఆయన వెంట నెల్లూరు డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా, రేంజర్ రవీంద్రబాబు , నెల్లూరు, అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారులు ఉన్నారు.

కూటమి మోసాలపై సమరం

చంద్రబాబు మేనిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్దాం

- వంచించడంలో బాబు బహుముఖ ప్రజ్ఞాశాలి
- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- నాగలాపురం సమావేశంలో భూమన కరుణాకరరెడ్డి దిశా నిర్దేశం



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు భూమన , నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం : చంద్రబాబుకు మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని, ఆయన చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండల కేంద్రంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అనే అంశంపై నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను ఏడాది పూర్తయినా అమలు చేయకపోగా ప్రజలను మోసం చేసే విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 143 హామీలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను గాలికొదిలేసి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో డైవర్షన్ రాజకీయాలకు కూటమి నాంది పలుకుతోందని విమర్శించారు. చంద్రబాబు మోసాలను ప్రతి గడపకు వివరించేందుకు ఈ కార్యక్రమం ఒక్క చక్కటి అవకాశమని , ఆ దిశగా ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నాయకుడు నడుం బిగించి ప్రజలకు తెలియజేయడంలో ముందుండాలని భూమన పిలుపునిచ్చారు.

అన్ని వర్గాలకూ దగా

సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను ఇబ్బందిపెడుతున్నారని ఆయన ఆరోపించారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం ఆర్థిక విధ్వంసాన్ని సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. కూటమి ఏడాది పాలనలో ఎక్కడా లేనంత ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకున్నారని, దాని ఫలితమే జగనన్న ఎక్కడికి వెళ్లినా జనం జేజేలు కొడుతున్నారన్నారు. ఆ ఆదరణను చూసి ఓర్వలేక జగనన్న పర్యటనలకు కుట్రలు పన్నుతున్నారన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి సమక్షంలో నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ శ్రేణులతో కలసి ఆవిష్కరించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారి సెల్‌ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి అందులో చంద్రబాబు మోసాలను ప్రజలకు వారి ఫోన్ల ద్వారానే వివరించాలని సూచించారు.



నాగలాపురం : సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

జగన్ 2.0 లో కార్యకర్తలకే ప్రాధాన్యం

నాగలాపురంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలనలో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని, ఆ దిశగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారన్నారు. కూటమి పాలనలో ప్రతి అంశాన్ని జగన్ మోహన్‌రెడ్డి నిశ్చితంగా పరిశీలిస్తున్నారని, కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని తప్పనిసరిగా గుర్తు పెట్టుకుని రిటర్న్ గిఫ్ట్ అందిస్తారన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సారథ్యంలో సత్యవేడు గెలుపునకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కారిక విభాగం మాజీ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవి రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, పళ్లికొండేశ్వరాలయ మాజీ చైర్మన్ ఏఎంఎం బాలాజీ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు అపరంజిరాజు (నాగలాపురం), సుశీల్‌కుమార్ రెడ్డి (సత్యవేడు), నాయుడు దయాకర్ రెడ్డి (వరదయ్యపాళెం), గవర్ల కృష్ణయ్య (కేవీబీపురం), మణి నాయుడు (బీఎన్‌కండ్రిగ), చలపతిరాజు (పిచ్చాటూరు), సారకాయలు (నారాయణవనం), మండల రైతు విభాగం అధ్యక్షులు చిన్నదొరై, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

9న వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయండి

ఆపదలో ఉన్న మామిడి రైతుల ఇబ్బందులను తెలుసుకునేందుకు ఈనెల 9న చిత్తూరు జిల్లా బంగారుపాళెం మామిడి మార్కెట్ యార్డ్‌కు వస్తున్న మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం చేయాలని సత్యవేడు నియోజకవర్గ పార్టీ శ్రేణులకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గంలో సైతం పెద్దఎత్తున రైతులు మామిడి పంటను సాగు చేశారని, అయితే ఈ ఏడాది ఎన్నడూ లేనివిధంగా మామిడి రైతులు నష్టపోయారని, అందుకు కూటమి ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు.

అగ్నిగుండం .. పాపహరణం



అగ్నిగుండం మహోత్సవానికి తరలివచ్చిన భక్తజనం

కణకణ మండుతున్న నిప్పు కణికలు , భక్తి పారవశ్యంతో ఆదివారం కంకణదారులైన భక్తులు నిప్పుల గుండం తొక్కి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ధర్మరాజులస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో చివరిగా అగ్నిగుండ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి సింహ వాహనంపై అధిష్టించారు. అగ్ని గుండంలో నిప్పులను తీసుకుని మల్లెపూలలో పెట్టి అమ్మవారి ఒడిలో పోసి ప్రత్యేక హారతులు సమర్పించారు. ఆలయ అనువంశిక పూజారులు అగ్నిగుండ ప్రవేశం అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో నిప్పుల గుండం తొక్కారు. పోలీసులు, ఆలయ అధికారులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు. – శ్రీకాళహస్తి



అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిల్లకూరు : గూడూరు పెద్ద మసీద్ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఆసుపత్రి వర్గాలు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆసుపత్రికి చేరుకుని వివరాల కోసం ప్రయత్నించగా అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. సుమారు 58 సంవత్సరాల వయస్సు కలిగి పింక్ కలర్ టీ షర్టు వేసుకుని గళ్ల లుంగీ కట్టుకుని ఉన్నాడని తెలిపారు. ఎవరైనా గుర్తించేందుకు వీలుగా ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో మృతదేహం ఉంటుందన్నారు. ఎవరైన వ్యక్తి అదృశ్యం అయినట్లు ఫిర్యాదు ఇచ్చి ఉంటే మృతదేహం చూసి గుర్తించి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కత్తితో యువకుడి హల్‌చల్

చంద్రగిరి : మద్యం మత్తులో ఓ యువకుడు కత్తి తీసుకుని హల్‌చల్‌కు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. నరసింగాపురం రైల్వేగేటు వద్ద శివ అనే వ్యక్తి మద్యం మత్తులో కత్తితో స్థానిక వ్యాపారులపై దాడికి యత్నించాడు. ఈ క్రమంలో ఓ ఆటోలో నుంచి జారిపడిన వస్తువులను ప్రవీణ్ అనే వ్యక్తి సాయం చేస్తున్న క్రమంలో శివ, ప్రవీణ్‌పై కత్తితో దాడికి యత్నించాడు. ఈ క్రమంలో శివను అడ్డుకున్న అతని సోదరుడు భాగ్యరాజ్ చేతికి స్వల్ప గాయమైంది. ప్రవీణ్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కత్తిని స్వాధీనం చేసుకుని శివను అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో దాడికి యత్నించాడా లేక గంజాయి ప్రభావంతో అలా ప్రవర్తించాడా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.



కౌలు రైతుల ఎదురుచూపులు

దుక్కిదున్నుతున్న కౌలు రైతు

- సీసీఆర్ కార్డుల జారీలో జాప్యం
- కౌలు రైతులకు తప్పని కష్టాలు
- జిల్లా వ్యాప్తంగా లక్ష్యం 10 వేల కార్డులు
- జారీ చేసింది కేవలం 4,261
- 2024లో జారీ చేసింది 9,895 కార్డులు
- కూటమి ప్రభుత్వ తీరుపై కౌలు రైతుల ఆగ్రహం

తిరుపతి అర్బన్ : వ్యవసాయశాఖ నుంచి కౌలు రైతులకు ఇచ్చే సీసీఆర్ కార్డు 11 నెలలు మాత్రమే గడువు ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ తీసుకోవాల్సి ఉంటుంది. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ 2024లో 9,895 మందికి సీసీఆర్ కార్డులను జారీ చేశారు. వాటి ఆధారంగా రబీతో పాటు ఖరీఫ్ సీజన్‌లోనూ బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందారు. అయితే కూటమి సర్కార్ 2025లో 10 వేల సీసీఆర్ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇప్పటి వరకు జారీ చేసింది కేవలం 4,261 కార్డులు మాత్రమే. దీంతో మిగిలిన కౌలు రైతులు ఖరీఫ్ సీజన్‌లో బ్యాంక్ నుంచి రుణాలు పొందలేకపోయారు. కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇచ్చి ఉంటే కౌలు రైతులు నష్టపోయేవారు. వచ్చే రబీ సీజన్ సెప్టెంబర్ నుంచి ప్రారంభం కానుంది. కనీసం అప్పటిలోపు సీసీఆర్ కార్డులు జారీ చేస్తే ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన కౌలు రైతులు కనీసం రబీలో అయిన బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందడానికి అవకాశం ఉంటుంది.

పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు సీసీఆర్ కార్డు (క్రాఫ్ కల్టివేటర్ రైట్స్ కార్డు) ఓ వరం లాటింది. రైతు భరోసాతో పాటు ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్ని రాయితీలు పొందడానికి, ధాన్యం విక్రయించడానికి, బ్యాంకు రుణాలు పొందడానికి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల రాయితీ పొందడానికి సీసీఆర్ కార్డులు కౌలు రైతులకు ఎంతో ఉపయోగ పడనున్నాయి.

కూటమి ఏడాది పాలనలో ..

ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇస్తామని కూటమి ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తి అయింది. ఏడాదిలో ఒక ఖరీఫ్ సీజన్, ఒక రబీ సీజన్ గడిచింది. ఈ ఏడాది మళ్లీ ఖరీఫ్ సీజన్ పూర్తవుతూ ఉంది. ఇప్పటి వరకు రైతు పెట్టుబడికి అన్నదాత సుఖీభవ ఇవ్వలేదు. మరోవైపు ఉచిత పంటల బీమా గత సర్కారు ఉచితంగా చేస్తే.. కూటమి సర్కారు మాత్రం రైతులే ఎకరానికి కొంత మొత్తాన్ని చెల్లించి పంటల బీమా చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడిస్తారో తెలియదు. రాయితీ విత్తనాలు నామ మాత్రమే, ఎరువులు సంగతి తెలిసిందే...ఎప్పుడు డిమాండ్‌గానే ఉంటున్నాయి. రాయితీ పరికరాలు పచ్చనేతలకే పంచిపెట్టారు. మామిడి పంటను కొనుగోలు చేయలేని దుస్థితి జిల్లాలో నెలకొంది. రైతులు నానా తిప్పలు పడుతున్నారు. కౌలు రైతుల విషయంలో కనీసం సకాలంలో సీసీఆర్ కార్డులను కౌలు రైతులకు అందించలేకపోయారు. దీంతో కౌలు రైతులు కూటమి సర్కారు తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

రైతులకు గత వైఎస్సార్‌సీపీ సర్కారులో రైతు భరోసా, ఉచిత పంట బీమా అందించడంతో పాటు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీతో ట్రాక్టర్లు, వరికోత యంత్రాలతో పాటు 46 రకాల వ్యవసాయ పరికరాల మంజూరు, నాణ్యమైన విత్తనాలు ఇవ్వడంతో పాటు రాయితీ కల్పించడం, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరం అయిన మేరకు ఎరువులు ఇవ్వడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, ఎప్పటికప్పుడు రైతులకు పంట సాగుపై సలహాలు సూచనలు ఇవ్వడం, భూసార పరీక్షా కేంద్రాల్లో నిత్యం పరీక్షలు నిర్వహించి...సాగు చేయాల్సిన పంటలపై అవగాహన కల్పించి రైతులకు అన్ని విధాల అండగా నిలిచింది. దిగుబడిని పెంచే పంటలను ప్రోత్సహించడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగుపై అవగాహన కల్పించేవారు. జిల్లాలో తెలుగు గంగ నీటిని రబీతో పాటు ఖరీఫ్ సీజన్లకు ఇవ్వడం ద్వారా గతంలో ఏటా 75 వేల ఎకరాల బీడు భూములు సాగులోకి తీసుకొచ్చింది.

అస్తవ్యస్తంగా సచివాలయాలు

- కుంటుపడుతున్న పాలన
- రేషన్‌కార్డుల సవరణ కేంద్రాల్లో ఇక్కట్లు
- సచివాలయాలు 691 నుంచి 353కు కుదింపు



బదిలీల కౌన్సెలింగ్‌లో ఉద్యోగులు (ఫైల్)

తిరుపతి అర్బన్ : కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో సచివాలయాలను నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో నిర్ణయాలు తీసుకుంటున్నట్లు జోరుగా చర్చసాగుతుంది. అందులో భాగంగా జిల్లాలో చూస్తే 691 సచివాలయాల్లో 5625 మంది ఉద్యోగులు పనిచేస్తుంటే....వాటిని 353 సచివాలయాలుగా కుదింపు చేశారు. దీంతో ఉద్యోగుల మిగులు తప్పలేదు. తాజాగా నిర్వహించిన బదిలీల్లో 1975 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు లేవంటూ రిజర్వులో పెట్టేశారు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

స్పష్టతలేని బదిలీలు

బదిలీల్లో స్పష్టత లేకుండా పోయింది....ఉమ్మడి జిల్లాలు ప్రాతిపదికన సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుపతిలో పనిచేస్తున్న 60 శాతం ఉద్యోగులకు చిత్తూరులో, 30 శాతం ఉద్యోగులకు నెల్లూరులోను, 10శాతం ఉద్యోగులకు తిరుపతి కలెక్టరేట్‌లోను బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కార్ నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా బదిలీలు నిర్వహించాలని పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. దీంతో జూన్ 30తో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి అయినప్పటికీ...బదిలీల్లో పారదర్శకత కొరవడడంతో పలువురు ఉద్యోగులు న్యాయం కోసం రోడ్డెక్కారు. మరికొందరు కోర్టుమెట్లు ఎక్కడానికి సిద్ధం అవుతున్న క్రమంలో వాటిని సరిచేయాలనే ఉద్దేశంతో జులై 5 వరకు కౌన్సెలింగ్ గడువు పెంచారు. మేజర్‌గా జరిగిన తప్పులను సవరించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు కౌన్సెలింగ్ పూర్తి అయినప్పటికీ బదిలీల జాబితాను మాత్రం గోప్యంగా ఉంచారు. వెల్లడించడానికి మరో రెండు మూడు రోజుల సమయం పడుతుందని చర్చ సాగుతోంది.

స్తంభించిన పాలన

జిల్లాలో సచివాలయ పాలన నెల రోజులుగా స్తంభించిపోయింది. సచివాలయంలో అందిస్తున్న పలు సేవలు కుంటుపడ్డాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా రేషన్ కార్డుల సవరణ కోసం ఒక్కో నియోజకవర్గంలో 5 నుంచి 8 సచివాలయాల్లో చేసుకోవడానికి వీలుగా నెల రోజుల క్రితం కేంద్రాలను కేటాయింపు చేశారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో 55 వేల దరఖాస్తులను అందుకున్నారు. ప్రధానంగా చిరునామా మార్పుల కోసం 2490, ఆధార్ సవరణ 660, కార్డులో సభ్యుల చేరిక కోసం 39,050, సభ్యుల తొలగింపునకు 1360, కొత్త కార్డుల కోసం 7262, కార్డుల విభజన కోసం 4581, ప్రభుత్వానికి సరెండర్ చేసిన కార్డులు 34 ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే ఈ కేంద్రాలు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నేపథ్యంలో వేగవంతంగా ముందుకు సాగడం లేదని పలువురు వాపోతున్నారు. బదిలీలు పూర్తి చేస్తే...కొత్త ఉద్యోగులైన వచ్చి వారి పనులు వారు చేసుకుంటారని అంతా చర్చించుకుంటున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రేణిగుంట : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన గణేష్ అనే వ్యక్తి చీటీ డబ్బులు అడిగినందుకు పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే పోలీసు సిబ్బంది అప్రమత్తమై అతనిని నిలువరించి కౌన్సెలింగ్ ఇచ్చి కేసు నమోదు చేశారు. సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు.. కృష్ణాపురానికి చెందిన గణేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ గ్రామంలో చీటీలు నడుపుతున్నాడు. ఈ క్రమంలో అతడి వద్ద ఎస్‌యూ పురానికి చెందిన ఆర్.షణ్ముగం చీటీ పాడినా, డబ్బులు చెల్లించకపోగా, అడిగితే ఆత్మహత్య చేసుకుంటానని గణేష్ తనను బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో ఆదివారం రేణిగుంట పోలీసులు గణేష్‌ను స్టేషన్‌కు పిలిపించారు. గణేష్, అతని భార్య లక్ష్మి, మామ వెంకటమునితో కలిసి స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు చీటి డబ్బులు విషయమై గణేష్‌ను అడగగా, వారిముందే వాటర్ బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకున్నాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు బాటిల్ లాక్కుని అతడిని నిలువరించారు. సమస్య ఉన్నప్పుడు సర్ది చెప్పుకోవటమో చట్టపరంగా ఎదుర్కోవటమో చేయాలే కానీ, ఇలా ఆత్మహత్యకు యత్నించటం సరైన పద్ధతి కాదని పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చోరీపై క్లూస్‌టీం విచారణ



తనిఖీ చేస్తున్న క్లూస్ టీం సభ్యులు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట పట్టణంలోని ముకాంభిక గుడి వీధిలో నివాసం ఉంటున్న గంగినేని హరేంద్ర్ ఇంటిలో ఆదివారం చోరీ జరిగిన ప్రాంతాన్ని క్లూస్ టీంతో పోలీసులు విచారణ చేశారు. దుండగులు బీరువాలో దాచి ఉంచిన 55 సవర్లు బంగారు నగలు చోరీ అయ్యాయి. కాగా బీరువా లోపలి అరలో దాచి ఉంచిన రూ.3 లక్షల నగదును అలానే ఉండడాన్ని సీఐ బాబి గుర్తించారు. అయితే దుండగులు ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంటిలో చొరబడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

తిరుమలలో కార్డన్ సెర్చ్



తిరుమలలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : తిరుమలలోని పాపవినాశనంలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాపవినాశనంలోని 140 షాపులను తనిఖీ చేసి 40 అనధికారికంగా ఉన్న లైసెన్సులను గుర్తించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుమల ఏఎస్పీ రామకృష్ణ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగ నిద్రలో నరసింహుడు

– పెంచలకోనలో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు



యోగనిద్ర అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రాపూరు : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి మాట్లాడుతూ తొలి ఏకాదశి నాడు శ్రీమన్నారాయణుడు యోగ నిద్రకు ఉప క్రమిస్తారని తెలిపారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా నరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని పాల సముద్రంలో యోగ నిద్రలో ఉన్నట్లుగా శ్రీవారి కల్యాణ మండపంలో వివిధ రకాల పుష్పాలు ,ఆభరణాలతో అలంకరించారు. శ్రీవారికి 15 రకాల ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు.

శేషవాహనం స్వామి అమ్మవార్లు

తొలిఏకాదశి సందర్భంగా శేష వాహనంపై లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మిదేవి, చెంచులక్ష్మిదేవి ఉత్సవ విగ్రహాలను కొలువు తీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు.



శ్రీవారికి 15 రకాల ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించిన అర్చకులు

అనుమతి గోరంత.. తవ్వేది కొండంత



అనుమతికి మించి గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న యంత్రాలు



టిప్పర్లతో అటవీ ప్రాంతం నుంచి తరలి వెళుతున్న గ్రావెల్

- సాగరమాల పేరుతో గ్రావెల్ తరలింపు

చిట్టమూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మట్టి, ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. చిట్టమూరు మండలం యాకసిరి పంచాయతీలో సాగరమాల పేరుతో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వి తరలించి ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. 20 సెంట్ల ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతి గనుల శాఖ నుంచి కాకుండా స్థానిక రెవెన్యూ అధికారుల వద్ద తీసుకుని ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన అనుమతి పత్రంలో ఎంత మేర తవ్వకాలు చేపట్టాలనే విషయాన్ని నమోదు చేయకుండా అనుమతి ఇవ్వడం చూస్తుంటే ఈ అక్రమ బాగోతం ఎంత పెద్ద స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.

లేఅవుట్లకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ..

యాకసిరి గ్రామ సర్వే నంబర్ 425లో 20 సెంట్లలో సాగరమాల రోడ్డు నిర్మాణం కోసం గ్రావెల్ తవ్వకాలకు అనుమతి తీసుకున్నారు. అయితే పెత్తనం కూటమి నాయకులదే కావడంతో వారు అనుమతి లేని మరో 3 ఎకరాలలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి నాయుడుపేట, కోట, చిల్లకూరు ప్రాంతాలలో వేస్తున్న లే అవుట్‌లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు అధికారులకు అక్రమ తవ్వకాలపై స్థానిక ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేసినప్పటికీ భారీ స్థాయిలో ముడుపులు ముట్టడంతో కనీసం అటు వైపుగా అధికారులు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రైవేటు సైన్యం పహారా

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టే ప్రాంతంలో యువకులు ఒక ప్రైవేటు సైన్యంలా ఉంటూ పహారా కాస్తున్నారు. గ్రావెల్ తవ్వకాలు భారీగా చేపడుతున్నారని గ్రామస్తులు మీడియాకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకునే సరికే ప్రైవేటు సైన్యంలా వ్యవహరించే సుమారు 15 మంది యువకులు క్రికెట్ బ్యాట్‌లు, స్టంప్‌లతో అక్కడికి చేరుకుని ఈ ప్రాంతంలోకి ఎవ్వరూ రాకూడదని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

అనుమతి ఇచ్చిన ప్రభుత్వ భూమిలో ఎంత మేర తవ్వకాలు చేపడుతున్నారు. వారికి ఎంత అవసరం ఉంది అనే విషయాలను ఒక్కసారైనా పరిశీలించాల్సిన అధికారులు అనుమతి ఇచ్చాం , మీకు ఎంత వీలుంటే అంత తవ్వకోపొండని అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి రోజు రెండు హిటాచీలు, పది టిప్పర్లు నిరంతరాయంగా తవ్వకాలు చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తవ్వకాలపై పర్యవేక్షణ ఉంచి అనుమతికి మించి తవ్వకాలు చేయకుండా అధికారులు కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

లోయలో పడి గుర్తు తెలియని వ్యక్తి ..



చంద్రగిరి : లోయలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తిరుపతి–పీలేరు జాతీయ రహదారి భాకరాపేట కనుమలో చోటు చేసుకుంది. సీఐ సుబ్బరామిరెడ్డి వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం సుమారు 38 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి భాకరాపేట ఘాట్‌లోని పెద్ద మలుపు లోయలో పడి మృతి చెందినట్లు అటుగా వెళ్తున్న ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో కలసి ఘటన స్థలానికి చేరుకుని, లోయలో పడి ఉన్న మృతదేహాన్ని పైకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాన్ని పరిశీలించగా, ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడు శనివారం రాత్రి లేదా ఆదివారం ఉదయం లోయలో పడి మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

ఎన్నికల జాబితాపై బీఎల్‌వోలకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఎల్‌వో (బూత్ లెవల్ ఆఫీసర్)లకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ఈ నెల 5 నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఇచ్చేలా కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయా నియోజకవర్గాల ఈఆర్‌వోల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు 50 మందికి మించకుండా శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ శిక్షణలో ఎన్నికల ఓటర్ల జాబితాలో చేపట్టాల్సిన చర్యలను బీఎల్‌వోలకు క్షుణ్ణంగా వివరించనున్నారు.

అసలు సిసలైన నాయకుడు జగనే

- హామీలిచ్చి విస్మరించిన చంద్రబాబు ఎప్పటికీ మోసగాడే
- ఇది ప్రజలకు చెప్పడానికే రీకాలింగ్ మేనిఫెస్టో ఉద్దేశం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన, మాజీ మంత్రి రోజా



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ చూపుతున్న నేతలు

నగరి : అట్టడుగు ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన అసలు సిసలైన ప్రజా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. నగరిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఆయన మాజీ మంత్రి ఆర్కే రోజాతో కలిసి క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. భూమన మాట్లాడుతూ మోసపూరిత మేనిఫెస్టోతో చంద్రబాబు ప్రజలను బురిడీ కొట్టించారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని జగన్‌మోహన్ రెడ్డి నెరవేరిస్తే అంత కన్నా ఎక్కువ చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పింఛన్ తప్ప ఏమీ అందిచలేదన్నారు. వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి భయపడి 30 లక్షల మందికి కోతలు పెట్టి తల్లికి వందనం అమలు చేశారని దుయ్యబట్టారు. 3 అంకణాలకు మించి ఉన్నా, రూ.300 విద్యుత్ బిల్లు ఉన్నా రూ.8,020 మాత్రమే వేశారని చమత్కరించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి సంతకాలు చేసిన బాండ్లు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారని చెప్పారు. గెలిచాక ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. ఏ హామీలు ఇచ్చారు ఏవి అమలు చేయలేదు అని క్షేత్రస్థాయి వరకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమ ఉద్దేశమన్నారు. జగనన్న చేసిన మంచిని చంద్రబాబు చేసిన మోసం ప్రజలకు తెలియజెప్పడం ప్రతి కార్యకర్త బాధ్యతన్నారు.

సనాతన యోధుడు ఏమయ్యాడు

తిరుమలలో దేవుడితో సమానమైన గోవుని కాపాడుకోలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, శ్రీకూర్మంలో తాబేళ్లు చనిపోతున్నాయని వీటిపై సనాతన యోధుడు పిఠాపురం పీఠాధిపతి పవన్ ఎందుకు స్పందించడం లేదన్నారు. ఆయన తమిళనాడుకెళితే తాను అక్కడే పుట్టానంటాడు.. గుంటూరుకు వెళితే అక్కడా పుట్టానంటాడు.. పిఠాపురం వెళితే అక్కడే పుట్టానంటున్నాడు.. అసలు ఆయన ఎక్కడ పుట్టాడో ఆయనకే తెలియడం లేదని ఎద్దేవా చేశారు. అందరూ వీకెండ్‌కు వెకేషన్‌కు వెళితే, పవన్ వీకెండ్‌కు మాత్రమే రాష్ట్రానికి వస్తారన్నారు. ఎవరు రాష్ట్రానికి మంచిచేస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరి పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, ఎంపీపీలు భార్గవి, మునివేలు, విజయలక్ష్మి, దీప, వైస్‌చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పవన్ తిక్కకు బాబు లెక్కలు

పవన్ తిక్కకు చంద్రబాబు వద్దే లెక్కుందని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ముఖ్యమంత్రిగా ఉండి అన్నీ హామీలు నెరవేర్చేశానని చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎంతమంది ఉంటే అంత మందికి జగన్ చేసిన సంక్షేమం కన్నా ఎక్కువ చేస్తాం అంటూ ఎన్నికల బీరాలు పలికిన బాబు నేడు దీన స్వరంతో పథకాలు తలచుకుంటే భయమేస్తోందంటున్నారని ఆయన నటనకు ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చని పేర్కొన్నారు. ఆయనకు అబద్ధాలు చెప్పే కళ ఉందని, నిజం చెబితే తల పగిలే శాపం కూడా ఉందేమో అన్నారు. అందుకే ఆయన అబద్ధాలు మాత్రమే చెబుతారంటూ ఎద్దేవా చేశారు. ఆయన చంకలో కూర్చున్న పవన్ తానే టీడీపీని అధికారంలోకి తెచ్చానంటుంటే, తాము లేకుంటే పవన్ ఎమ్మెల్యేగా కూడా గెలవరని టీడీపీ చెబుతోందని, ఇలాంటి నాయకులందరూ కూటమిగా కొనసాగుతుండడం దౌర్భాగ్యమన్నారు. ఆడపిల్లలకు అన్యాయం జరిగితే వారికి కఠినంగా శిక్షించే చట్టాలు తెస్తానన్నారు. ఇంత మంది ఆడపిల్లలు అఘాయిత్యాలకు బలవుతున్నా నోరుమెదపడం లేదేమిటని ప్రశ్నించారు. పవన్‌కు చంద్రబాబు చూపే గ్రాఫిక్స్ తప్ప మిగతా విషయాలు ఏవీ కనబడవన్నారు.